


కాలింగ్ బెల్ మోతకి విసుక్కుంటూ లేచింది విమల. ఆదివారం హాయిగా అలస్యంగా నిద్ర లేవచ్చు అనే ఆశ నిరాశయ్యింది. పిల్లలూ భర్తా నిశ్చింతగా నిద్రపోతున్నారు. తల సవరించు కుంటూ తలుపు తెరిచింది.

అరుణ పేలవంగా నవ్వింది. భుజం మీద పడుకున్న పాప. ఇంకో చేతిలో హేండ్ బ్యాగ్, వాచిన కళ్ళు అరుణ పరిస్థితిని చెబుతున్నాయి.

"రండి అరుణా ఇలా కూచోండి" చెయ్యి పట్టుకుని సోఫాలో కూచోబెట్టి పాపని తీసుకుంది. అరుణ వెంటనే ఏడవడం ప్రారంభించింది.

"అరుణా ప్లీజ్"

"నాకసలు బ్రతకాలని లేదండీ. అసలలా బ్రతకడం ఏమీ బాగాలేదు"

"పోనీ ఎలా బ్రతికితే బావుంటుందో ఆలో చించుకోండి. ఈ లోపల కాఫీ పట్టుకొస్తాను" విమల అనునయంగా నవ్వి లోపలికెళ్ళింది. స్టౌ అంటించి పాలు పడేసి బ్రష్ చేసుకుంది. కాఫీ కలుపుతూ అరుణ చాలా డిప్రెస్‌డ్‌గా ఉంది అనుకుంది.

కాఫీ తాగాక అరుణ కొంచెం తేరుకుంది. పాలు తాగిన పాప కులాసాగా కళ్ళు అటూ ఇటూ తిప్పుతూ ఊసులు చెబుతోంది.

మంచి ఉద్యోగిని. అయినా ఒక మగవాడికి భార్య. శెలవు రోజున నిర్విచారంగా గడపకుండా పుట్టెడు దుఃఖంతో బయటకు వచ్చిందంటే ఆమె నంతగా కలవరపరిచిన పరిస్థితులేమిటో? విమల మనస్సు ఆర్ద్రమయింది.

"చెప్పండి"

"ఏం చెప్పను. ఆఫీసులో అప్పుడప్పుడూ మీకు చెప్పుకుంటూనే ఉంటాగా! ఆ మనిషితో ఇక వేగలేనండి. లేచినప్పటి నుండీ నస. నేను మంచి ఇల్లాలినయితేనే నన్ను గుర్తిస్తారట. నేను ఉద్యోగిని అవడంవల్ల అతని దృష్టిలో ఏనాటికీ మంచి ఇల్లాలిని కాలేను. తను సిగరెట్ అంటించు కుని తీరిగ్గా నా పనులు పరిశీలిస్తూ వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తుంటాడు."

"అంతేనా?"

"రోజూ ఇంతే. ఇంటి పనితో చంటిపిల్ల పనితో ఉద్యోగంతో నాకు పిచ్చెక్కుతోంది. అసలు నేను సంపాదిస్తున్నాననే స్పృహ, ఆనందం నాకేమీ లేవు. మనస్సూ శరీరమూ బాగా విశ్రాంతిని కోరు కుంటున్నాయి" అరుణ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఉద్యోగమూ, పెళ్లీ పిల్లలూ అన్ని వరసగా జరిగితే ఇలాగే అనిపిస్తుంటుంది అరుణా. అధైర్య పడకండి"

"నాకు అబార్షనయిందన్న జాలికూడా లేదు ఎవరికీ. అన్నింట్లో నేను సమర్థవంతంగా ఉండా లంటారు."

"అది ఆశించడం కాదు. దోపిడీ"

"నేనింక వేగలేనండీ"

"వేగలేనంటూ రెండేళ్ళు గడిపేశారు"

"మరి అనుకున్నంత సులభమా వదిలే యడం?" అరుణ నిరాశగా చూసింది.

"కాదు."

"అందుకే అడ్జస్ట్ అవుతున్నా. ఓపికున్నంత వరకూ"

విమల విచారంగా నవ్వింది. "లాంగు బాటునే సర్దుబాటు అనుకుంటాం. ఈ అడ్జస్ట్‌మెంట్‌లో కనీసం అప్పుడప్పుడయినా సుఖమూ శాంతీ లభిస్తున్నాయా?"

"లేదు"

"మరి?"

"నిజమే జీవితం ఏమీ బావుండ్లేదు" అరుణ ఆలోచనలో పడింది. తన భర్త పదిమందిలో మంచివాడుగానే ఉంటూంటాడు. మరి తనంటే ఎందుకో చులకన. తన చదువూ ఉద్యోగంలో తన తెలివితేటలూ అతనికి అక్కర్లేని విషయాలు. ఇంటి పనులు టక టకా చేయలేదని విమర్శిస్తూంటాడు. మంచి కొడుకు, మంచి అన్నయ్య, మంచి ఆఫీసరుగా మాత్రమే ఉంటాడుగాని మంచి భర్తగా ఉండడానికి ప్రత్యేకంగా ఏమీ కష్టపడడు. కాని భార్యగా అన్ని రకాలుగా ఇంట్లో అందరినీ సంతృప్తి పరచాలని ఒకరకంగా శాసిస్తున్నారు. ఘోరం.

ఈ లోపల ప్రసాద్ వచ్చి "హలో" అంటూ ఉప్మా ప్లేట్ అందించాడు. "ఇంకాస్సేపు వెయిట్ చేస్తే పెసరట్లు కూడా తీసుకొస్తా" అన్నాడు హుషారుగా.

అరుణ సిగ్గు పడింది. 'పాపేది, విమలేది' అనుకుంటూ అటూ ఇటూ చూసింది. ఏం మాట్లాడాలో తెలియడం లేదు.

"పాప గురించి బెంగక్కర్లేదు. పిల్లలు ఆడిస్తున్నారు. అదిగో మీ ఫ్రెండ్ వచ్చేసింది" ప్రసాద్ లోపలకి వెళ్ళిపోయాడు. విమల తనూ తింటూ "ప్రసాద్ చాలా బాగా చేస్తాడు ఉప్మా" అంది.

"ఆయనకి వంటొచ్చా?"

"నాకు వచ్చినప్పుడు అతనికి రావడంలో ఆశ్చర్యమేముంది?"

అరుణ మాట్లాడలేదు. "మీరు అదృష్టవంతులు" అంది మెల్లగా.

"ఇప్పటివరకూ. కాని జీవితమంతా ఇంత నిశ్చింతగా ఉండగలననే గ్యారంటీ ఏమీ లేదు."

అరుణ విస్మయంగా చూసింది. "మీ వైవాహిక జీవితాన్నీ, మీ ఇద్దరి మధ్యా ప్రేమనీ మీరు నమ్మరా?"

"నమ్ముతాను. కాని పరిస్థితులన్నీ ఇలా ఎప్పుడూ అనుకూలంగానే ఉంటాయని నమ్మలేను"

"ప్రేమ మీకా నమ్మకం కలిగించాలి కదా?"

"నిజమే. ఆ ప్రేమ నశిస్తే మాత్రం ఈ జీవితాన్ని వదిలేస్తా"

గతుక్కుమంది అరుణ. తనింత తెగింపుగా చెప్పగలదా? ప్రసాద్‌తో నిశ్చింతగా బ్రతుకుతూ కూడా విమల భవిష్యత్ గురించి నిర్భయంగా అంచనా వేస్తూ నిర్ణయం చెబుతోంది. తన కన్నా వయస్సులో అనుభవంలో పెద్దది. అదొక్కటే కాదు ఆమెది పరిపక్వమయిన మనస్సు. సాటి స్త్రీలంటే అపారమైన సానుభూతి.

ఆ తర్వాత వాళ్ళు చాలా విషయాలు మాట్లాడుకున్నారు. దాదాపుగా ఉద్యోగినుల సమస్యలన్నీ ఇలాగే ఉన్నాయి. పెళ్ళివల్ల మగవాడికి బాధ్యతలు పెరుగుతూంటాయేమో గాని చాకిరీ అంటూ ఏమి పెరగదు. అంతకు ముందు తల్లీ చెల్లెలూ చేసి పెట్టే పనులన్నీ భార్య సునాయాసంగా చేయాలనుకుంటాడు. అరుణ భర్త కుమార్ పూర్తిగా అటువంటివాడే. తక్కువ సమయంలో ఎక్కువ పనులు భార్య చెయ్యాలని అనుకునే అతను భార్య పట్ల ప్రేమానురాగాలు చూపించడానికి మాత్రం సమయం లేదంటాడు. ఎప్పుడయినా వాదిస్తే 'నిన్నిలా పెంచారు' అంటూ అరుణ తలిదండ్రుల్ని దుయ్యబడతాడు. నిత్యమూ ఇదే వాతావరణంలో బ్రతుకుతున్న అరుణకి పిచ్చెక్కుతోంది.


"నాకేమీ అర్థంకావడం లేదు విమలా ఈ రకమయిన జీవితం పట్ల నాకేమీ ఆకర్షణ లేదు. మీ అందరిలా ఉల్లాసంగా నేను లేకపోతున్నాను. ఆఫీసు వర్క్ కూడా నన్ను భూతంలా భయపెడుతోంది" అరుణ బేలగా అంది.

స్త్రీ సమస్యల పట్ల ఒక్క అవగాహనే కాదు పరిష్కారాలు చూపించే తెగువా, మానవతా విమలకి పుష్కలంగా ఉన్నాయి.

"మీ ఇంట్లో పనులు ఇద్దరూ సమానంగా చేసుకుంటారు కదూ!" అరుణ అంది.

"దాదాపు. ఇది మగ పనీ, ఇది ఆడ పనీ అని విభజించుకోం పనిపిల్ల ఉన్నాసరే వంట ఇంటి శుభ్రతా బట్టల పనీ ఇలా ఏ పనులయినా ఎవరికి వీలయినప్పుడు వాళ్ళు చేసుకుంటాం. పిల్లలకీ అలాగే నేర్పుతున్నాం. అందుకే ఆరోపణలు లేకుండా శాంతిగా జరిగిపోతోంది సంసారం"

"నాకిదో కలలా ఉంది. ఎవరూ ఇంత బాగా బ్రతకడం లేదు"



మల్లెపూలుగానీ గులాబిపూలుగానీ మార్కెట్టు నుండి అవసరానికి తెచ్చుకున్నట్లయితే వాటిని నిల్వ చేసుకోవడం పెద్ద సమస్యే ఔతుంది. సాధారాణంగా చాలామంది తడిబట్టతో కప్పి నిల్వ చేస్తూంటారు. ఈ పద్ధతి సరైనదే గానీ ఇలా తడిబట్ట వేసేపుడు ముందుగా దాన్ని ఉప్పు కలిపిన నీటిలో కాసేపు నాననిచ్చి పూలపై కప్పి వుంచుకోవాలి.

–భోశ్రీ

"చాలా తక్కువ శాతం మగవాళ్ళు మాత్రమే ప్రసాద్‌లా ఆలోచిస్తారు కాబట్టి. మిగిలిన వాళ్ళంతా వ్యవస్థకి మానసికంగా పూర్తి బానిసలు. అవగాహన పెంచుకుంటే ఇంకాస్త ఆనందంగా బ్రతకవచ్చనే ఇంగితం లేనివాళ్ళు. ప్రసాద్‌లా ప్రేమకి ఎంత మంది విలువిస్తున్నారు?" విమల కళ్ళలో ప్రేమ, కృతజ్ఞత తళుక్కుమన్నాయి. ముచ్చటగా చూసింది అరుణ. ఎంత మంది నవీన యువతుల్లో ఆ మెరుపు కనిపిస్తుంది?

"మీతో మాట్లాడుతుంటే నాకు కొత్త శక్తీ ఉత్సాహం వస్తున్నాయండీ" తేలికపడిన మనస్సుతో మనస్ఫూర్తిగా అంది.

"థాంక్స్. అదే నాక్కావాల్సింది. ఏ స్త్రీ కన్నీరు పెట్టడం నేను భరించలేను. మన సమస్యలకి మనమే స్పందించి పోరాడాలి". ఆ తర్వాత వాళ్లు కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. అరుణ భర్త ఎంత గింజుకుని గొడవ పెట్టినా సరే అరుణ పాపతో సహా ఒక నెలరోజులు విమల దగ్గరే ఉండాలి. అప్పుడే అరుణ మానసికంగా కొంత తేరుకుంటుంది. అరుణ వైపు నుండి వచ్చే గొడవలు ఎదుర్కోవడానికి దంపతులిద్దరూ సిద్ధంగా ఉంటారు.

నిజంగానే అరుణకి ఆ నెల రోజులూ దివ్యమైన కాలం అనిపించింది. ఈ ఇంట్లో పనులు చాలానిశ్శబ్దంగా జరిగిపోతూంటాయి. అరుపులూ, విసుక్కోడాలూ టెన్షనూ ఏమీ ఉండవు. ఒకర్ని ఒకరు అనవసరంగా డిస్టర్బ్ చేసుకోరు. అధికారాలతో వేధించుకోరు. ఇద్దరూ పుస్తకాలు బాగా చదువుతారు కాబట్టి ఏ విషయం గురించయినా జ్ఞానంతో చక్కగా చర్చిస్తారు. మంచి మంచి స్నేహితులు వస్తూంటారు. వీటన్నింటి మధ్య పిల్లలచదువు పాడవకుండా ఇద్దరూ శ్రద్ధ తీసుకుంటారు. రాత్రి నిద్ర పోయే ముందు మంచి పాటలు వింటారు. "రిలాక్సేషన్ అంటూ ఉంటేనే రేపటి రోజుని ఉత్సాహంగా ఆలోచించగలం" అంటుంది విమల. వీళ్ళ దిన చర్య కఠినంగా ఉండదు నియమంగా ఉంటుంది. జీవితం విచ్చల విడిగా ఉండదు. స్వేచ్ఛగా ఉంటుంది.

"ఎలా బ్రతకాలో మిమ్మల్ని చూసి నేర్చుకోవాలి" అరుణ చాలాసార్లు ఇద్దరితో అంది.

మధ్యలో చాలా గొడవలు జరిగాయి. అరుణ తన పుట్టిల్లు వైజాగ్‌కి ట్రాన్స్‌ఫర్ పెట్టుకుంది. అరుణ తిరిగి రాదేమోననే భయంతో కుమార్ దిగివచ్చాడు. అందరూ ఊహించినట్టు పురుషాహంకారంతో 'నువ్వు లేకపోతే మరొకరు' అనే ధిక్కారంతో మాట్లాడ లేదతను. అసలు వీళ్ళు విడిపోతారేమోనని రెండు వైపుల పెద్దలూ ఆందోళన పడ్డారు. కొన్ని మహిళా సంఘ ప్రతినిధులూ మానవ హక్కులకి సంబంధించిన ఒకరిద్దరు మగవాళ్ళూ కూడా తీవ్రంగా సమస్యని చర్చించడంతో కుమార్ తాత్కాలికంగా కన్విన్సయి తనూ ట్రాన్స్‌ఫర్‌కి పెట్టుకుంటానన్నాడు. ఈ లోపల అతని చెల్లెలి పెళ్ళి జరిగిపోతుంది. తమ్ముడు మద్రాసులో చదువుకుంటున్నాడు. తల్లి భారమేమీ కాదు. అరుణకి

భారం తగ్గి విశ్రాంతి దొరికితే కుటుంబం ఆర్థికంగా బయటపడి సుఖప్రదంగా జీవిస్తుంది.

"మీ మేలు మర్చిపోలేను" అరుణ కన్నీళ్ళతో చేతులు జోడించింది. ట్రయిన్ బయల్దేరడానికి సిద్ధంగా ఉంది.

విమలకీ ఈ ఒక్కనెలతోనే అరుణతోనూ, ఆమె పాపతోనూ మంచి అనుబంధం ఏర్పడింది. "నేనూ మిస్ అవుతున్నాను" అంది అరుణ చెయ్యి నొక్కుతూ జీరగా.

"మీలాంటి ఫ్రెండ్‌ని పొందడమే నాకు గొప్ప అనుభవం."

"నాకో కోరికుంది"

"చెప్పండి"

"మళ్ళీ నీ లాంటి పరిస్థితులతో ఎవరయినా తారసపడితే నువ్వు ధైర్యం చెప్పు. ఆ ధైర్యం ఓదార్పు వాళ్ళకి చాలా శక్తినిస్తుంది. అదే మనం సాటి స్త్రీలకి చేయగల సహాయం."

"తప్పకుండా"

"బై అరుణా"

ట్రయిన్ కదుల్తోంది. కనుమరుగయ్యే వరకూ చెయ్యి ఊపుతూ నిల్చుంది విమల.

• • •

పదేళ్ళకాలం చాలా రకాల మార్పుల్ని తీసు కొచ్చింది. ఎవరి జీవితాల్లో వాళ్ళు చాలా బిజీ అయిపోయారు. మధ్యలో రెండు మూడుసార్లు ఏదో కాన్ఫరెన్సుల్లో కలవడం తప్ప పాత కొలీగ్స్ ప్రత్యేకంగా కలుసుకోవడం అంటూ జరగలేదు. హఠాత్తుగా సికింద్రాబాద్ స్టేషన్‌లో కనబడిన అరుణని చూస్తూ "అరుణా" అని అరిచింది విమల సంతోషంగా.

అరుణ గాగుల్స్ తీసి చూసింది. ఎల్లోటి మైసూరు సిల్క్ చీరలో కొత్త హెయిర్ స్టయిల్‌తో అందంగా హుందాగా ఉన్న అరుణని చూస్తూ 'గుర్తు పట్టలేదా' అంది విమల నవ్వుతూ.

"ఓ విమలా! ఎక్కడ్నుంచి!"

"నాకు మళ్ళీ హెడ్డాఫీసుకీ ట్రాన్స్‌ఫరయింది. రేపు మీకు ఫోన్ చేద్దామనుకుంటున్నా."

"నేనసలు లీవ్‌లో ఉన్నాన్లెండి. ఇప్పుడే చుట్టా లకి సెండాఫ్ ఇచ్చి వస్తున్నా. బావున్నారా?" విమలని పరీక్షగా చూస్తూ "పిల్లలు పెద్ద వాళ్ళయ్యారు రిలీఫ్‌గా ఉంది కదూ" అంది.

విమల టూకీగా వివరాలు చెప్పింది. చెబుతూనే అరుణని పరిశీలించింది. కుడిచేతికి అరడజను బంగారు గాజులున్నాయి. మెడలో అందంగా గోల్డ్ ఫ్రేం వర్క్ చేసిన నల్లపూసల గొలుసూ గట్టి మంగళ సూత్రం తాడూ ఉన్నాయి. మనిషి నిండుగా దర్జాగా అదోరకమయిన అందంతో తమాషాగా ఉంది.

అరుణ కూడా క్రీగంట విమలని పరీక్షగా చూస్తూనే ఉంది. 'ప్చ్ ఏమీ మార్పులేదు' అనుకుని నిట్టూర్చింది.

"ఇల్లు దొరికే వరకూ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉండాలని ప్లాన్. పిల్లలు కాలేజీకి వచ్చారు. నేను దగ్గర లేకపోయినా ఫర్వాలేదు. అందుకే ఈ ప్రమోషన్ యాక్సెప్ట్ చేశాను."

"అయినా మీకేమిటి ప్రసాద్‌గారిలాంటి..."

"నీకు తెలియదా?"

"ఏమిటి"


"మేమిద్దరం విడిపోయాం" ఇద్దరూ మాట్లాడు కుంటూ బయటకొచ్చారు. అరుణకి షాక్ తిన్నట్లు యింది. ఎన్ని గొడవలున్నా విడాకులు తీసు కోవడం సమంజసమా? అరుణ ఆలోచిస్తోంది. పదేళ్ళలో తను చాలా మారింది, కుమార్‌ని ఎలా వంచాలో బాగా తెలుసుకుంది. అతను తగ్గి పోయాడు. తను ఉద్యోగంలో రెండు మెట్లెక్కింది. స్వంత ఇల్లూ, ఫోనూ, కారూ సంపాదించు కున్నారు. బంధువుల్లో, అత్తగారింట్లో, పుట్టింట్లో తను మంచి పలుకుబడీ అధికృతా సంపాదించు కుంది. అమ్మో ఈ మాత్రం గడుసుదనం నేర్చు కోకపోతే తనని బ్రతకనిచ్చేవారా? విమలేమిటీ అన్ని తెలివితేటలుండీ ఇంత మందికి సలహాలు చెప్పే విమలకి తన సంసారం దిద్దుకోవడం తెలియలేదా?

"పిల్లల గురించి ఆలోచించవద్దా? అయినా ఇప్పుడా విడిపోవడం?" అదో రకంగా చూసింది.

"తప్పలేదు. అతనా పరిస్థితి కల్పించాడు. మంచి భర్తగా ఆదర్శవంతమయిన భర్తగా పాపం జీవితాంతం ఉండలేకపోయాడు!"

"చాలామంది కన్నా ప్రసాద్‌గారు ఎంతో మంచివారు"

"నిజమే అతని జీవితంలో ఇంకో స్త్రీ ప్రవే శించింది. అందువల్ల అతని వైఖరి పూర్తిగా మారి పోయింది. తగాదాలతో తీర్పులతో ఇటువంటి సమస్యలు పరిష్కరించుకోలేము. అయినా నా వంతుగా కొన్ని సజషన్స్ ఇచ్చి ఓపిక పట్టినా సాధ్యం కాలేదు. అందుకే విడిపోవడం చాలా



నగరాల్లో ఇప్పుడు ఎక్కువగా అటాచ్‌డ్ బాత్‌రూంగల బెడ్‌రూంల పోర్షన్లు కన్పిస్తున్నాయి. ఈ పోర్షన్లలో నివసించే వారికి రాత్రిపూట పక్కనే ఉన్న బాత్‌రూం నుండి వాసన వేస్తూంటుంది. బాత్‌రూం డోర్ తెరిచి వుంచి అగ్గిపుల్లని గీసి అది ఆరి పోయే దాకా ఉంచాలి. ఇలా రెండు మూడు పుల్లల్ని గీసి మండించితే రూం లోని వాసనంతా బైటికి వెళ్ళిపోతుంది...

—భోశ్రీ

మంచి దనిపించింది. ఇప్పుడు హాయిగా ఉన్నాను."

"హాయిగా ఉన్నారా?"

"ఆ.. ఈ మధ్యకాలంలో నన్ను కల్లోలపరిచిన ఆలోచనా సముద్రం నుంచి సురక్షితంగా బయట పడ్డా. అందుకే ప్రశాంతంగా ఉన్నాను. హాయిగా ఉన్నాను." అంది విమల వాచీ చూసుకుంటూ. "నా కోసం మాకజిన్ వస్తుంది మీరు ఇంటికి తొందరగా వెళ్ళాలా!" అంది.

"మీ రూట్ చెప్పండి. డ్రాప్ చేస్తాను." ఆమెని తనింట్లో పెట్టుకోవచ్చు. అయినా అరుణ అంత చొరవగా అనలేకపోతోంది. కారు దగ్గరకి నడిచింది.

"మీ రూట్ వేరు నా రూట్ వేరు"

"ఫర్వాలేదు"

"ఎందుకమ్మా శ్రమా?"

"నాకేం బావుండ్లేదు మీరిలా విడిపోవడం పిల్లల పెళ్ళిళ్ళూ అవీ...."

"కొంతమంది పరువు గురించి పాతివ్రత్యం గురించీ ఆలోచిస్తారు. డబ్బు గురించి సరే సరి. నేను ప్రేమ గురించి మానవ సంబంధాలలో నిజాయితీ గురించీ, స్త్రీ చైతన్యం గురించీ ఆలోచిస్తాను. ఫర్వాలేదు నేను జీవితంలో చాలా భాగం మంచి ప్రేమనే పొందాను. ఇప్పుడు ఇదో కొత్త మలుపు. నాకేం బాధ లేదు. పోరాటానికి నేనెప్పుడూ సంసిద్ధమే."

"సరే ఇంతవరకూ చైతన్యం బాగానే ఉంది. మరి ప్రసాద్ ఇంకో స్త్రీతో హాయిగా జీవిస్తున్నారు. మీరు అలా...." అరుణ కారు దగ్గర నిలబడి సూటిగా చూసింది ఏ ఆడదీ ఇక్కడ మాత్రం ఇంతకన్నా తన గీతని దాటలేదని ఆమె అభిప్రాయం.

"రేపు చెబుతాను అదిగో వాళ్ళొచ్చేశారు" విమల చెయ్యి ఊపి వేగంగా వెళ్ళిపోయింది.

తనూ చాలా మారింది నిజమే. కాని విమలలో ఉన్న సాహసం తెగింపూ తనకి లేవు. అవకాశ వాదం, అతి తెలివీ మాత్రమే తనకి సుఖాన్ని చ్చాయి. ఆమెని తన దగ్గరే ఉండమని చొరవగా పిలవలేకపోతోంది. అరుణకి ఆ రాత్రి ఎందుకో నిద్రపట్టలేదు.

మర్నాడు ఫోన్ కాల్. విమల గొంతు వినగానే ఆసక్తిగా "ఆ ప్రశ్నకి సమాధానం చెప్పండి" అంది.

విమల నవ్వు వినపడింది. "చెబుతా. పిల్లల మీద ప్రేమ చాలా నిర్ణయాలకి అడ్డొస్తుంది. చిన్న తనంలోనే అమ్మని అర్థం చేసుకునే మెచ్యూరిటీ వాళ్ళకి రాదుగా! వాళ్ళు పూర్తిగా సెటిలయ్యాక అసలు నా మనస్సు స్పందించి నిజంగా తోడు కోసం పరితపిస్తుంటే నలభయ్యేళ్ళుకాదు యాభ య్యేళ్లు వచ్చినా సరే ఇంకో పురుషుడితో హాయిగా బ్రతికేస్తాను. చూద్దాం, మరి భవిష్యత్ ఎలా ఉంటుందో!"

"విమలలా నేను బ్రతకలేను" అరుణకి ఎందుకో తను సరిగ్గా బ్రతుకుతున్నానా అనిపించి బరువుగా నిట్టూర్చింది. ✱